"అలాగే"

రెండవతారీఖు ఉదయం ఎల్. ఐ. సి. కి వచ్చాడు ఆ ఇంటాయన. కామేశ్వరరావు సీటు దగ్గరికి వెళ్ళి అతని చేతిలో మాట్లాడకుండా నాలుగు వందలు ఉంచాడు.

"ఇదేమిటి?" సంభ్రమంగా అడిగాడు కామేశ్వరరావు.

"నీకు ఇల్లు ఇవ్వటంలేదు. మరో పది తక్కువయినా ఇంకొకరికి ఇచ్చేశాం"

"ఎందుకు? ఎందుకు?" గొణిగాడు కామేశ్వరరావు.

"మా పక్కింటావిడ నిన్ను గుర్తుపట్టి చెప్పబట్టి సరిపోయింది లేక పోతే...."

"ఏం చెప్పింది?"

"ఈ వారం పత్రికలో నీ ఫొటో అచ్చయిందటగా? నువ్వు రచయితవని చెప్పింది, బ్రహ్మచారులకయినా ఇస్తాంకాని రచయితలకి ఇల్లు ఇవ్వను" వెళ్ళిపోయాడాయన.

## ఓ ఇంటి కథ

శ్రీవారు ఇంటికిరాగానే ఆయన కోటు విప్పుతూ చెప్పింది సరసీ రుహ.

"మంటూ ఏం చేసాడో చూసారా?"

మంటూ వారి ప్రథమ సంతానం. పేరు గౌరవ్. కాని చిన్నప్పుడు పెట్టిన ముద్దుపేరు "మంటూ" పెద్దయినా పోలేదు. బయటవాళ్ళు గౌరవ్‌గా పిలుస్తారు.

"యేం చేసాడు?" అడిగాడు సరసీరుహ భర్త.

ఆవిడ టేబిల్‌మీదవున్న టేబిల్ లేంప్‌ని చూపించింది.

"ఎక్కడిదిః" అడిగారాయన ఆశ్చర్యంగా.

"రాత్రి చదువుకోడానికి టేబిల్ లాంప్ కావాలని వారంరోజులుగా గొడవపెడుతున్నాడా? పొద్దున్న వీధిలో ఎవరిదో పర్సు దొరికిందట అందులోని ఏభై రూపాయలతో ఇది కొని తెచ్చుకున్నాడు"

"ఎవరిదా పర్సు?" అడిగాడాయన కొడుకుని.

"అడ్రస్ లేదు"

"అదిటు తీసుకురా"

చాలా పాత పర్స్ అది నలిగిపోయి నల్లబడిపోయింది అక్కడక్కడ ఎర్రరంగు తెలుస్తోంది. నాణాలు వేసుకునేకానా చిరిగిపోయివుంది ఇంకా ఆరు రూపాయలు వున్నాయి అందులో.

"ఇదెవరిదో కనుక్కుని వారికి ఇవ్వాలని తెలీదూ?" కోపంగా అడిగాడాయన అందులోని కాగితాలు బయటికితీస్తూ.

చింపిన తెల్లకాగితం ముక్కలు, ఏవో బిల్స్, ఇంటికి తీసుకురావలసిన వస్తువుల జాబితా వుంది. అందులోని వస్తువులనుబట్టి ఆ ఏభై రూపాయలు అవి కొనడానికి వుద్దేశింపబడినవే అని గ్రహించాడు గౌరవ్ తండ్రి.

"ఈ లిస్టు చూస్తే బీదవాడని తెలుస్తుంది-కాని పౌడర్‌కూడా కొనే స్థితిలోలేడు. "కాఫీ విత్తుల పేకెట్" అని రాసివుంది" సరసీరుహకి అది అందించి చెప్పాడు.

"వాళ్ళ అడ్రస్ లేదు నాన్నగారు. వుంటే ఇచ్చేవాడ్నిగా. ఇంకేం చేయాలో తోచక టేబిల్‌లాంపు కొనితెచ్చాను"

"ఈపర్స్ ఓనర్ అడ్రస్ తెలుసుకోవచ్చు" చెప్పింది సరసీరుహ

"ఎలా?" అన్నట్లు చూసారు ఇద్దరూ.

కొనవలసిన వస్తువులేకాక, చేయవలసిన పనుల జాబితాకూడా ఇందులో రాసివుంది.

"బట్టలకొట్టులో నలబై ఆరు రూపాయలు జమచేయాలి అని రాసి వుంది. బట్టలకొట్టు క్రెడిట్ బిల్ నలబై ఆరు రూపాయలని వుంది చూడండి బిల్ మీద "కొమరయ్య" అని రాసివుంది—ఈ బట్టలషాపుకెళ్ళి కొమరయ్యని గురించి వాకబ్ చేస్తే తెలుస్తుంది"

"ఎలా?" అడిగారాయన.

"అలాగే నాన్నగారు" చెప్పాడు గౌరవ్. అతనిలోని అయిష్టాన్ని చూచాయిగా పసిగట్టింది సరసీరుహ

రెండురోజుల తర్వాత కొడుకుతో చెప్పింది సరసీరుహ.

"నీకో కథ చెప్పనా? ఓసారి ఒకతనికి రోడ్డుమీద ఓ నోట్ బుక్ దొరికింది తీసిచూస్తే ఎస్. ఎస్, ఎల్. సి చదివే ఓ అబ్బాయి నోట్ బుక్. ఆ నోట్ బుక్‌లో అయిదు రూపాయల నోటుకూడా వుంది. అతను ఆ నోట్ బుక్‌ని డస్టుబిన్‌లో పారేసి, ఆ అయిదు తీసుకుందామనుకున్నాడు, కాని మనసు వప్పలేదు. ఆ ఐదురూపాయలు నాలుగు రోజులు అతనిదగ్గరే వుంది.

చివరికి అతని మనసాక్షే గెలిచింది. నోట్ బుక్‌లో ఆ అబ్బాయి రాసుకున్న చిరునామాకు వెళ్ళి అతని తండ్రికి అయిదు, నోట్ బుక్ ఇచ్చాడు, అంత ఆలస్యంగా తీసుకురావడానికి కారణంకూడా ఫ్రేంకుగా చెప్పాడు. ఆ అబ్బాయి తండ్రి అతన్ని కూర్చోమని కాఫీ తెప్పించి ఇచ్చాడు. అతనిలోని ఆనెస్టీ ఆయనకి నచ్చింది. కేవలం యీ పాయింటు వల్లే అయన తన కూతుర్ని ఐదు రూపాయలు తెచ్చిచ్చినతనికి ఇచ్చి వివాహం చేసాడు తెలుసా?"

"ఎవరు వాళ్ళు?" అడిగాడు గౌరవ్ ఆసక్తిగా.

"మీ అమ్మా నాన్న"

గౌరవ ముహం క్షణక్షణం పాలిపోయింది.

మర్నాడు సాయంత్రం సరసీరుహ ఇంటికివచ్చిన భర్తకోటు విప్పుతుంటే ఆయన భార్యకి చెప్పాడు.

"ఇవాళ మధ్యాహ్నం మన ప్రబుద్ధుడు డబ్బుతో సహా పర్స్ కొమరయ్యకి తిరిగి ఇచ్చాడట. ఓ మినీ కథతో "ఆనెస్టీ ఈజ్ ది బెస్టు పాలసీ" అన్న సంగతి బాగా బోధించావు మన కుమారరత్నానికి. ఎలాగయినా రచయిత్రివి కదా"

## బిగ్ ఇడియట్

సాయంత్రము దగ్గరపడే కొద్దీ త్రిభువన్‌కి ఎంతో ఆనందంగా వుంది. ఆ సాయంత్రము ఆరున్నరకు అతని జీవితంలో మరపురాని రోజుగా మారే సంఘటన జరుగతోంది.

తొలిసారిగా త్రిభువన్ స్టేజ్ ఎక్కుతున్నాడు

సన్మానింపబడుతున్నాడు రచయితలని, రచయిత్రులని, ముఖ్యమంత్రులని, సినిమా పరిశ్రమకి సంబంధించిన వాళ్ళని సన్మానించటం రివాజే

కార్టూనిస్టులకి ఎందుకో ఆ గౌరవం లభించటంలేదు. తొలిసారిగా త్రిభువన్‌ని హైద్రాబాద్‌లోని ఓ సాంస్కృతిక సన్మానిస్తోంది, ఆయన వేసిన కార్టూన్స్‌లో వెయ్యి ప్రచురింపబడిన సందర్భంగా.

చాలాకాలంనుంచి తనకి సన్మానం జరగాలనే కోరిక త్రిభువన్‌లో వుంది. ప్రయత్నం లేకుండా, మెరిట్‌మీద సన్మానం జరగడం ఈ రోజులలో అరుదు కాబట్టి త్రిభువన్ తన ప్రయత్నాలు ప్రారంభించాడు.

నెలరోజులలో ఓ సాంస్కృతిక సంస్థ సెక్రటరీకి, త్రిభువన్‌కి ఓ అంగీకారం కుదిరింది. ఆగస్టు రెండో ఆదివారం సాయంత్రం ఆరున్నరకి